# వెరై 'టీ'లతో ఉపాధి



- తేనీటి ప్రియులకు విభిన్న రుచుల 'చాయ్'లు
- మార్కెట్లో పెరుగుతున్న ఆదరణ
- యువతకు మంచి ఉపాధి మార్గం

కుభీర్, అక్టోబర్ 29: సమయం ఏదైనా చాయ్ తాగేందుకు సంశయిచేవారుండరు. ఒక్కరే ఉన్నా.. స్నేహితులతో కలిసి ఉన్నా, బంధువులతో ముచ్చటిస్తున్నా, తోటి ఉద్యోగులతో కూర్చొని ఉన్నా ముందుగా గుర్తు కొచ్చేది చాయ్. అయితే ట్రెండ్ మారింది. చాయ్ రుచులు కూడా మారి పోయాయి. తేనీటి ప్రియులు కోరుకునే రుచుల్లో వివిధ రకాల చాయ్‌లను అందించేందుకు కొత్త కొత్తగా టీ స్టాళ్లు ఏర్పాటవుతున్నాయి. పలు రకాల టీలను అందించడమే కాకుండా తేనీటి ప్రియులకు విభిన్న రుచుల్లో చాయ్ లభిస్తుండడంతో మార్కెట్‌లో ఈ టీ స్టాళ్లలో గిరాకీ రోజురోజుకీ పెరుగుతోంది.

–ధమ్ చాయ్ నుంచి మలాయ్ కాఫీ వరకు..




రాకేశ్ టీ స్టాప్

ధమ్ చాయ్ నుంచి బూస్ట్, కాఫీ, అల్లం టీ, లెమన్ టీ, పెరిపెరీ మ్యాజిక్ లాంటి వాటితో పాటు తులసీ ఆకులు, సబ్జ గింజలతో చేసిన బ్లాక్ టీ వరకు వివిధ రుచుల్లో టీ అందుబాటులో లభిస్తోంది. ఉస్మానియాతో పాటు పలు రకాల బిస్కెట్స్ అందుబాటులో ఉండడంతో గిరాకీ మరింత ఊపందుకున్నది. సాధారణ టీ రూ.5లకే లభిస్తుండగా, మిగతావి రూ.10లకే అందిస్తుండడంతో సామాన్యులు సైతం వెరై'టీ' ల వైపు మొగ్గు చూపుతున్నారు.

**ఉపాధి పొందుతున్న యువత..**

మండల కేంద్రంలో పలువురు యువకులు టీ స్టాళ్లు ఏర్పాటు చేసుకొని ప్రతి రోజూ రూ.500కు పైగా లాభం పొందుతున్నారు. కుభీర్‌కు చెందిన మైనార్టీ యువకుడు సోయెల్ ఖాన్ తన సొంత ఆలోచనతో టీ స్టాల్‌ను ఏర్పాటు చేసుకుని వివిధ రకాల టీ లను అందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ప్రతి రోజూ 20 నుంచి 30 లీటర్ల పాలతో హోటల్‌ను కొనసాగిస్తూ ఉపాధి పొందుతున్నాడు. దీనికి తోడు వివిధ రకాల బిస్కెట్లు, పాలు సైతం విక్రయిస్తున్నాడు. మండలంలోని హల్ద గ్రామానికి చెందిన నామాల రాకేశ్ టీ పాయింట్ ఏర్పాటు చేసి ఉపాధి పొందుతున్నాడు. ఇలా మండలకేంద్రంలో పలువురు యువకులు స్వయం ఉపాధి పొందుతూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

**రోజూ సంపాదన రూ. 500 పైమాటే..**

నేను సొంతంగా వెరైటీ టీలను చేయడం నేర్చుకొని స్టాల్‌ను ఏర్పాటు చేశా. నావద్ద మలాయ్ కాఫీకి బాగా గిరాకీ ఉంది. పార్సల్ చాయ్ ఎక్కువగా అమ్ముతుంది. 25 నుంచి 30 లీటర్ల వరకు పాలు తీసుకుంటాను. పాలను కూడా అమ్ముతాను. బిస్కెట్లు కూడా అమ్ముత. రోజూ నా సంపాదన రూ. 500 నుంచి రూ. 600 వరకు ఉంటుంది.

**-సోయెల్ ఖాన్, టీ స్టాల్ యజమాని, కుభీర్**



**చాయ్ సూపర్..**

వివిధ రకాలైన టీ లను అందిస్తుండడంతో ఇక్కడికి వచ్చి చాయ్ తాగుతున్నాం. టేస్ట్ చాలా బాగుంది. ధమ్ చాయ్, గ్రీన్ టీ, అల్లం టీ, మలాయ్ కాఫీ రుచికరంగా ఉన్నాయి. చాయ్ రూ.5, మిగతావి అన్నీ కేవలం రూ.10కే అందిస్తుండడంతో గిరాకీ ఎక్కువగా వస్తున్నది.

**-శంకర్, కుభీర్**



# జాతరకు ముస్తాబైన భీమన్న ఆలయం

- భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు
- భీమన్న గజాల జలాభిషేకం పూర్తి



ముస్తాబైన భీమన్న ఆలయం

మామడ, అక్టోబర్ 29 : మండలంలోని కొరిటికల్ భీమన్న జాతరను సోమవారం నిర్వ హించనున్నారు. కాగా భీమన్న గజాలను ఆది వారం మునిపెల్లి గోదావరినదికి గంగస్నానానికి తీసుకవెళ్లారు.ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పూజలు చేశారు. వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయం వద్ద సౌకర్యాలు కల్పించినట్లు వీడీసీ సభ్యులు పే ర్కొన్నారు.

## నేడు డయల్ యువర్ డీఎం

భైంసా, అక్టోబర్, 29: పట్టణంలో సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భైంసా డీఎం అమృత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు 9959226005 కి సంప్రదించాలన్నారు.

## బీఆర్ఎస్వీ సమావేశానికి కుంటాల నేతలు



బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో కుంటాల నాయకులు

కుంటాల, అక్టోబర్, 29 : హైదరాబాద్‌లోని తెలంగాణ భవనన్‌లో జరిగిన బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసినట్టు బీఆర్ఎస్వీ కుంటాల మండల అధ్యక్షుడు ఒడ్నం అనిల్ తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో పరిశ్రమలు, ఉద్యోగ కల్పన వంటి అంశాలపై మాట్లాడారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారని ఆయన పేర్కొన్నారు. సంతోష్, ఆనంద్, కళ్యాణ్, సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 29: తెలంగాణ భవన్ లో నిర్వహించిన బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా కో–ఆర్డినేటర్స్, నియోజ కవర్గాల ప్రతినిధుల సమావేశానికి నస్పూర్ ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు తరలివెళ్లారు. బీఆర్ఎస్వీ మంచిర్యాల నియోజక వర్గం అధ్యక్షుడు దగ్గుల మధు కుమార్ ఆధ్వర్యం లో ఆదివారం నస్పూర్ ప్రాంత నాయకులు వెళ్లారు.

# 'గుస్సాడీ' కి వేళాయే..

- దీపావళి వేడుకల ఏర్పాట్లలో గిరిజనులు నిమగ్నం
- గానుగపట్టి నువ్వుల నూనె తయారీ
- ఆకట్టుకోనున్న సంప్రదాయ వేషధారణ



గుస్సాడీ నృత్యం చేస్తున్న కళాకారులు

బజార్‌హత్నూర్ అక్టోబర్ 29 : అడవుల జిల్లా ఆదిలాబాద్‌కు గోండు గిరిజనుల గుస్సాడీ వేషధారణ ప్రత్యేక గుర్తింపు వచ్చింది. అయితే ఈ సంప్రదాయాన్ని కాపాడుకునేందుకు, వ్యవహరించేందుకు గిరిజనులు పడుతున్న శ్రమ, కష్టం వెనుక ఎంతో నైపుణ్యం దాగి ఉంది. కాలగమనంలో సంస్కృతీసంప్రదాయలను మరిచిపోతున్న తరుణంలో నాటి కాలం నుంచి నేటి కాలం వరకు వాటిని కాపాడుకుంటూ వస్తున్నారు గిరిజనులు. నవంబర్ 12న దీపావళి వేడుకల నేపథ్యంలో బజార్‌హత్నూర్ మండలంతో పాటు ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గూడేల్లో కోలాహలం మొదలైంది. సంస్కృతీసంప్రదాయాలు ప్రతిబింబించేలా వేడుకలు నిర్వహించనున్నారు. దీపాలు వెలిగించడం కోసం స్వయంగా నువ్వుల నూనె తయారు చేస్తున్నారు. నెమలి ఈకల సేకరణ డప్పులు, డోలక్‌ల తయారీ కోసం రేయింబవళ్లు కష్ట పడుతున్నారు. గుస్సాడీ వేషధారణకు అవసరమయ్యే సామగ్రిని సమకూర్చుకుంటున్నారు. పండుగకు వారం రోజుల ముందు నుంచి ప్రతి రోజూ రాత్రి గ్రామ పటేల్ ఇంటి ఆవరణలో కోలాటాలు గుస్సాడీ నృత్యాలు సాధన చేస్తుండడం ఆనవాయితీగా వస్తున్నది.

**దండారీతో ఉత్సవాలు ప్రారంభం**

గిరిజన గూడేల్లోని గ్రామ పటేల్ ఇంటి ఆవరణలో నెమలి ఈకలతో ప్రత్యేకంగా తయారుచేసిన టోపీలు, జంతు చర్మంతో తయారు చేసిన డప్పులు, డోలు, గుమేల, ఫరా లాంటి వాయిద్యాలతో పాటు గజ్జెలు, కోలలు, మంత్ర దండం లాంటి రోకలి, తదితర సంప్రదాయ వస్తువులను ఒక్కచోట ఉంచి వాటికి మేకను బలిదానంతో ప్రత్యేక పూజలతో భోగి పండుగ చేసి దండారి ఉత్సవాలను ప్రారంభిస్తారు.

**గుస్సాడీలకు అతిథ్యం**

గుస్సాడీ వేషధారణ వేసినవారు తమ సొంత గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లి అక్కడి గిరిజనుల అతిథ్య విందులో పాల్గొని ఆటపాటలు, నృత్యాలతో కనువిందు చేయడం ఆనవాయితీగా వస్తున్నది. గ్రామానికి వచ్చిన గుస్సాడీలకు ఘనస్వాగతం లభిస్తుంది.



నృత్యం చేస్తున్న ఆదివాసీ మహిళలు

అంతే కాకుండా మొదట అతిథ్యం పుచ్చుకున్న వీరు తర్వాతి ఏడాది వారిని తమ గ్రామానికి ఆహ్వానిస్తారు. ఇలా చేయడంతో ఇరు గ్రామాల మధ్య బంధుత్వం పెరుగుతుందని పెద్దల నమ్మకం.

**పవిత్రంగా నిర్వహిస్తున్నాం..**

దీపావళి పండుగను మా గోండు గిరిజనులు ఎంతో పవిత్రంగా నిర్వహిస్తారు. వివిధ గ్రామాల్లో ఉన్న బంధువులు వారం రోజుల ముందుగానే గ్రామాలకు చేరుకోని ప్రత్యేక పిండి వంటలను చేస్తూ సందడిగా కనిపిస్తారు. దీంతో గ్రామాలన్నీ పండుగ వాతావరణంతో కళకళలాడుతాయి. అందరూ ఆహ్లాదంగా గడుపుతారు. చాలా పెద్ద పండుగ ఇది.



**-పెందూర్ ఈశ్వర్, జాతర్ల ఎంపీటీసీ)**

**ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం..**

గుస్సాడీ వేషధారణలో ధరించే సామాగ్రికి దండారి రోజున గ్రామ పటేల్ ఇంటి ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. నవవరుడు గుస్సాడీ వేషధారణ చేస్తే వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాఫీగా సాగుతుందని పెద్దల విశ్వాసం. తరతరాలుగా ఈ ఆనవాయితీ వస్తున్నది. మా తర్వాతి తరాలకు కూడా మేం ఇది అందిస్తాం. మన సంప్రదాయాలను మనమే కాపాడుకోవాలి.



**-పర్చ సాయన్న, గిరిజనుడు**